ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 20-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశంలో అక్రమ చొరబాట్లను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం సమర్ధవంతమైన చర్యలు తీసుకుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.
- భారత్ రాబోయే 25 ఏళ్ళలో పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ అన్నారు.
- విశాఖపట్నంలో ఈరోజు జరిగిన సదస్సులో హిందూ మహాసముద్ర నావికా సింపోజియం అధ్యక్ష పదవిని భారత్ చేపట్టింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.
- సెమీ కండక్టర్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలలో నాయకత్వ పాత్ర పోషించడమే భారతదేశ లక్ష్యమని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో అక్రమ చొరబాట్లను నియంత్రించడానికి గడచిన పదేళ్ళ కాలంలో కేంద్ర ప్రభుత్వం సమర్ధవంతమైన చర్యలు తీసుకుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. అస్సాం రాష్ట్రం కాచార్ జిల్లాలో ఇండో-బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతమైన కటిగరలోని నటన్‌పూర్‌లో హోంమంత్రి వైబ్రంట్ విలేజ్ ప్రోగ్రామ్ 2.0ని ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరిహద్దు ప్రాంతాలలో చొరబాటు దారులను గుర్తించి దశలవారీగా తొలగించడం జరుగుతోందని అన్నారు. అదే విధంగా సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్…28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలోని సేవా తీర్థంలో కృత్రిమ మేధ AI డీప్‌టెక్ స్టార్టప్‌ల ముఖ్య కార్యనిర్వహణాధికారులతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, మాతృభాషలో ఉన్నత విద్యను ప్రోత్సహించడం వంటి వివిధ రంగాలలో AI సాంకేతికతను ఉపయోగించుకునే సామర్థ్యాన్ని గురించి ప్రధాని చర్చించారు. బలమైన డేటా పాలన అవసరాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అదే సమయంలో తప్పుడు సమాచారం గురించి కూడా హెచ్చరించారు. భారతదేశ అవసరాలకు అనుగుణంగా పరిష్కారాలను అభివృద్ధి చేయాలని సూచించారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తరించడం గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

= = = = = = = = = = = = = = = = = = =

సెమీ కండక్టర్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలలో నాయకత్వ పాత్ర పోషించడమే భారతదేశ లక్ష్యమని కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్‌లో భారతదేశం యునైటెడ్ స్టేట్స్ పాక్స్ సిలికా డిక్లరేషన్‌పై సంతకం చేశాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, దేశంలోని ప్రతిభావంతులైన ఇంజనీర్లు అత్యంత సంక్లిష్టమైన, అధునాతనమైన రెండు నానోమీటర్ చిప్‌లను రూపొందిస్తున్నారని వెల్లడించారు. సెమీ కండక్టర్ పరిశ్రమకు 10 లక్షల మందికి పైగా ప్రతిభావంతులైన నిపుణులు అవసరమని ఆయన చెప్పారు. సెమీ కండక్టర్ పరిశ్రమకు అవసరమైన నిపుణును అందించడంలో భారతదేశం ముఖ్య పాత్ర పోషిస్తుందని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్…28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నంలో 9వ హిందూ మహాసముద్ర నావికా సింపోజియం (IONS) ఈరోజు జరిగింది. ఈ సందర్భంగా సింపోజియం అధ్యక్ష పదవిని భారత్ చేపట్టింది. రాయల్ థాయ్ నేవీ నుండి భారత నావికాదళం IONS అధ్యక్ష పదవిని స్వీకరించింది. IONS తొలి అధ్యక్ష పదవిని 2008 నుండి 2010 వరకు భారత్ నిర్వహించింది. 16 సంవత్సరాల తర్వాత భారతదేశం తిరిగి ఈ పదవిని అందుకుంది. హిందూ మహాసముద్ర తీర దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 33 దేశాల నుండి నావికాదళాల అధిపతులు, సముద్ర భద్రతా సంస్థల అధిపతులు ION సమావేశానికి హాజరయ్యారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర సహకారం భద్రతను బలోపేతం చేయడానికి ఈ సమావేశం కీలక పాత్ర నిర్వహిస్తోంది. భారత నావికాదళ అధిపతి IONS చైర్మన్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి ఈ సందర్భంగా మాట్లాడుతూ, సముద్ర భద్రత, విపత్తులో సహకారం, సమాచార భాగస్వామ్యం వంటి వాటిపై స్పష్టమైన కార్యాచరణతతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని తెలియచేసారు. ఇదిలా ఉండగా భారతదేశం తిరిగి అధ్యక్ష పదవిని చేపట్టడంతో హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రత పరంగా మరింత పటిష్టమైన వ్యూహాలతో పాటు సమిష్టి భాగస్వామ్యంతో కలసి పనిచేసేందుకు వీలు కలుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈ ఆదివారం 22వ తేదీన ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం రాబోయే 25 సంవత్సరాలలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ప్రపంచంలో భారతదేశాన్ని బలమైన స్థానంలో నిలబెట్టడానికి దేశీయ ఎగుమతులు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. న్యూఢిల్లీలో ఎగుమతి ప్రమోషన్ మిషన్ కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. MSME ఎగుమతులను బలోపేతం చేసే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా MSMEలు, అంకుర పరిశ్రమలకు అవకాశాలు మరింత పెరుగుతాయని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, బ్రెజిల్ వ్యవసాయ మంత్రి కార్లోస్ ఫావారోతో న్యూఢిల్లీలో ఈరోజు సమావేశమయ్యారు. అనంతరం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పాత్రికేయులతో మాట్లాడుతూ, బ్రెజిల్ వ్యవసాయ మంత్రితో ఉపయోగకరమైన చర్చలు జరిగాయని చెప్పారు. సేంద్రీయ వ్యవసాయంపై బ్రెజిల్ ఆసక్తిని కనబరిచిందని ఆయన తెలిపారు. బ్రెజిల్ భారతదేశంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయడానికి అంగీకరించిందని కేంద్ర మంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

జాతీయ విద్యా విధానం 2020 ప్రపంచ విద్యా సహకారాన్ని సైతం అనుమతిస్తుందని కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. స్పెయిన్-భారత్ ల మధ్యన 70 సంవత్సరాలుగా దౌత్య సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు.

విద్య, పరిశోధన వంటి వాటిలో ఉమ్మడి దృక్పథాన్ని కలిగి ఉన్నాయని ఆయన అన్నారు. భారతదేశంలో క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ప్రముఖ స్పానిష్ విశ్వవిద్యాలయాలను కేంద్ర మంత్రి ఈ సందర్భంగా ఆహ్వానించారు.

===================

AI ఇంపాక్ట్ సమ్మిట్‌ను ఏర్పాటు చేయడంలో భారతదేశం నాయకత్వ పాత్రను ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ గుటెర్రెస్ ప్రశంసించారు. అదే విధంగా వివిధ రంగాలలో ఐక్యరాజ్యసమితితో భారత్ దీర్ఘకాల సహకారాన్ని కూడా ప్రస్తావించారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఈరోజు ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, సమకాలీన భౌగోళిక-రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని సంస్కరించాలని కోరారు.

===================

ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా లీక్టెన్ స్టెయిన్ వంశపారంపర్య యువరాజు ప్రిన్స్ అలోయిస్‌తో ప్రధానమంత్రి నరేంద్రమోదీ న్యూఢిల్లీలో ఈరోజు ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరువురు నాయకులు వివిధ రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. భారతదేశం లీక్టెన్ స్టెయిన్ మధ్య వాణిజ్యం, పెట్టుబడి అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, AI, ఆవిష్కరణ నైపుణ్య అభివృద్ధి వంటి రంగాలలో పరస్పర సహకారం ఉండాలని ఇరువురు నాయకులు అభిప్రాయపడ్డారని పేర్కొంది.

===================

షిల్లాంగ్ లోక్‌సభ ఎంపీ డాక్టర్ రికీ ఆండ్రూ జె సింగోన్ మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు సంతాపం వ్యక్తం చేశారు. డాక్టర్ సింగోన్ మేఘాలయ అభివృద్ధికి దోహదపడ్డారని, ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారని రాష్ట్రపతి ముర్ము సామాజిక మాధ్యమం ద్వారా పెట్టిన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు రాష్ట్రపతి తన సంతాపాన్ని తెలిపారు.

===================

===================